

జిల్లాకేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



సిద్ధమా..? ప్లకార్డుతో డీఎస్సీ అభ్యర్థి నిరసన..


కలెక్టరేట్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

# ఇక యుద్ధమే.. సిద్ధమా...?

మెగా డీఎస్సీ అని దగా చేశావు

నాలుగు పోస్టులు ఇస్తే ఏం చేయాలి..?

- మే వరకూ రిటైర్మెంట్లను నోటిఫికేషన్‌లో చేర్చాలి
- లేకుంటే తెలంగాణ తరహా రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం
- సీఎం జగన్‌కు నిరుద్యోగ యువత హెచ్చరిక
- డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 3:** మెగా డీఎస్సీ వస్తుందని ఆశించిన అభ్యర్థులు.. ప్రభుత్వ ప్రకటన చూశాక తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ప్రభుత్వం తమను దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. 23 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ విడుదల చేయకుంటే తెలంగాణ తరహాలో రిటర్న్ గిఫ్ట్‌కు సిద్ధం కావాలని హెచ్చరించారు. ప్రజాపాలన చేతకాకుంటే రాజీనామా చేసి వెళ్లిపోవాలని సీఎం జగన్‌కు సూచించారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అధికారం చేపడితే అప్పటికైనా రాష్ట్రం బాగుపడుతుందని అన్నారు. అనంతరం కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులను తోసుకుని ఆవరణలోకి వెళ్లి బైఠాయించారు. నాలుగున్నర సంవత్సరాలుగా నిరుద్యోగులను ఊరించి, కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న అన్నారు. మే నెల వరకు ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుల స్థానాలను చేర్చి, డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే జీఓ 117ను రద్దు చేయాలని కోరారు. కలెక్టరేట్ ఆవరణలో ఆందోళనలు చేయకూడదని, వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. వారు వినకపోవడంతో బలవంతంగా అరెస్టు చేసి బయటకు తరలించారు. ఆందోళనలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్, నాయకులు జయరామ్, రఫి తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు




కలెక్టరేట్‌లో తోపులాట.. అరెస్టు చేస్తున్న పోలీసులు

## న్యాయం జరిగే వరకూ పోరాటం...

అన్ని ఉద్యోగాలిచ్చాం.. ఇన్ని ఉద్యోగాలిచ్చామని ప్రచారం చేసుకోవడమే తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది లేదు. 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేస్తామని హామీ ఇచ్చి, కేవలం 6100 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం దుర్మార్గం. నాలుగేళ్లుగా హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నాం. మా లాంటి నిరుద్యోగుల పరిస్థితి ఏమిటి..? మా తల్లిదండ్రులు ఒకపూట తినీ, తినక మాపై ఎన్నో ఆశలతో చదివించారు. జిల్లాలో కేవలం నాలుగు పోస్టులు మాత్రమే ఉన్నాయట. మేం ఏ మొహం పెట్టుకుని మా తల్లిదండ్రుల వద్దకు వెళ్లాలి..? మాకు న్యాయం జరిగేవరకూ ఎంతవరకైనా పోరాడుతాం. **- శ్రీవాణి, డీఎస్సీ అభ్యర్థి**

## మోసపూరిత ప్రకటన..


మా ఇంట్లో ఉన్న ఐదుగురు కుటుంబ సభ్యులం గత ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేశాం. నమ్మి ఓటేసినందుకు మా చెప్పుతో మేమే కొట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మా ఆందోళనను అడ్డుకుంటున్న పోలీసు శాఖతో సహా ఏ ఒక్క శాఖలోనూ ఈ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేపట్టలేదు. మరో 12 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. గతంలో మాదిరే మరోసారి వంచించి మా ఓట్లు దండుకునేందుకు ఈ మోసపూరిత డీఎస్సీ ప్రకటనను చేశారు. ముఖ్యమంత్రికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మెగా డీఎస్సీని విడుదల చేయాలి.

**- పవన్, డీఎస్సీ అభ్యర్థి**

## నీళ్లు చల్లారు...


నాలుగు సంవత్సరాల నుంచి వేల రూపాయలు వెచ్చించి పరీక్షలకు సిద్ధమవుతున్నాం. సొంతూళ్లను, తల్లిదండ్రులను వదిలి పట్టణాలకు వచ్చి కష్టాలను అనుభవిస్తున్నాం. మెగా డీఎస్సీ కోసం ఎంతగానో నిరీక్షిస్తున్నాం. మా ఆశలపై నీళ్ల చల్లుతూ వైసీపీ ప్రభుత్వం కేవలం నాలుగు పోస్టులను కేటాయించింది. వాటితో మేం ఏం చేయాలి..? చదువులేనివారు, చదువు విలువ తెలియనివారు పాలకులుగా ఉంటే సమాజం ఎలా బాగుపడుతుంది..? పథకాల పేరుతో డబ్బులు పంచేసినంత మాత్రాన రాష్ట్రం బాగుపడదు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తొలగినపుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుంది. ఈ సత్యాన్ని గ్రహించలేని పాలకులు మనకున్నందుకు బాధపడుతున్నా.

**- రిహాన, డీఎస్సీ అభ్యర్థి**

## 40 వేల మందికి నాలుగు పోస్టులా..?


జిల్లాలో దాదాపు 40 వేల మంది డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారు. కేవలం నాలుగు పోస్టులు ప్రకటించడం సిగ్గుచేటు. ప్రస్తుతం ఐటీ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. 1998, 2008 డీఎస్సీలలో ఇంగ్లీష్ లేదు. అప్పట్లో ఉద్యోగాలు పొందినవారు ఇప్పటి విద్యార్థులకు ఇంగ్లీష్ బోధన ఎలా చేస్తారు..? ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం మానేసి నాడు-నేడు పేరుతో కేవలం బిల్డింగులు కట్టుకుంటూ పోతే పిల్లలకు చదువు ఎవరు చెబుతారు..? మాట తప్పను.. మడమ తిప్పను అంటే జగన్‌ను నమ్మి నాలుగేళ్లపాటు నిరీక్షించాం. ఇప్పుడు దగా డీఎస్సీ ప్రకటించి మమ్మల్ని నట్టేట ముంచారు.

**- విష్ణు, డీఎస్సీ అభ్యర్థి**

# టీడీపీ గెలుపు చారిత్రక అవసరం

### మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వర్గీయులు

**డి.హీరేహాళ్, ఫిబ్రవరి 3:** తెలుగుదేశం పార్టీ గెలుపు రాష్ట్రానికి చారిత్రక అవసరమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. వైసీపీ నియంతృత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని, జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇక వార్ వన్‌సైడే అని అన్నారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న 'మన కోసం మన శీనన్న' కార్యక్రమంలో భాగంగా శనివారం ఓబుళాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు నుంచి గ్రామం వరకు 200 బైకులతో ర్యాలీ నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మంజునాథగౌడతో కలసి కాలవ గ్రామంలో పర్యటించారు. వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు బసవ, మహేష్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది టీడీపీలో చేరారు. వారికి కాలవ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామాన్ని మునుపెన్నడూ లేనంత అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగల్లి రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాదలూరు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా కాలనీలో రోడ్లు ఏవీ..?

### ఎమ్మెల్యే అనంతను నిలదీసిన జనం


ఎమ్మెల్యేని ప్రశ్నిస్తున్న కాలనీవాసులు

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3:** 'మా కాలనీలో రోడ్లు చూడండి ఎంత అధ్వానంగా ఉన్నాయో..! డ్రైనేజీ కాలువలు కూడా లేవు. ఎందుకు పట్టించుకోలేదు..?' అని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని నగర ప్రజలు నిలదీశారు. నగరంలోని 21వ డివిజన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేను సమస్యలపై స్థానికులు ప్రశ్నించారు. రోడ్లు, కాలువలు వేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మరికొందరు ఇంటి స్థలాలపై నిలదీశారు. కామారుపల్లిలో తమకు ఇంటి స్థలాలు ఇచ్చారని, కానీ నీటి సౌకర్యం లేకపోవడంతో ఇళ్లను నిర్మించుకోలేకపోయామని వాపోయారు. ప్రత్యామ్నాయ స్థలం కూడా చూపకుండా అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందడం లేదని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

# బీసీల పార్టీ తెలుగుదేశం

### రాప్తాడులో భారీ మెజార్టీతో గెలుస్తాం
### జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి పరిటాల సునీత



ఆత్మకూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

**రాప్తాడు/ఆత్మకూరు ఫిబ్రవరి 3:** రాప్తాడు నియోజకవర్గం నుంచి ఈ ఎన్నికల్లో తానే పోటీ చేస్తానని, భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు పరిటాల కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాప్తాడు, ఆత్మకూరులో శనివారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. రాప్తాడులో టీడీపీ నాయకులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆత్మకూరులో పరిటాల సునీతకు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కనకదాస కల్యాణ మంటపంలో కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీల కోసమే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని అన్నారు. బీసీల కోసం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర బీసీలకు అండగా నిలిచారని, జడ్పీ ఛైర్మన్‌లుగా, జడ్పీటీసీలుగా, ఎంపీటీసీలుగా చేశారని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, చెరువులు, చెక్‌డ్యాంలకు నీరు అందించి రైతులకు అండగా నిలిచామని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరులు బీసీలపై దాడులు చేయిస్తున్నారని, వారి ఆస్తులు ఆక్రమిస్తున్నారని అన్నారు. కొందరు పోలీసులు వైసీపీ తొత్తులుగా మారి, టీడీపీకి చెందిన వందలాది మంది బీసీలపై కేసులు పెట్టి వేధించారని, వారందరినీ గుర్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన తరువాత చుక్కలు చూపిస్తామని హెచ్చరించారు. రిజర్వాయర్లు నిర్మించి లక్ష ఎకరాలకు నీరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే... ఒక్క ఇటుక కూడా వేయలేదని అన్నారు. రూ.15 కోట్లు డిమాండ్ చేసి జాకీ పరిశ్రమ తరలిపోయేలా చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే, అతని సోదరుల ఎర్రమట్టి, భూ దందా, బెదిరింపులు, రియల్ ఎస్టేట్ వసూళ్లు మితిమీరిపోయాయని అన్నారు. అవినీతి, అక్రమాల్లో, భూ దందాల్లో రాప్తాడు నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని అన్నారు. గొందిరెడ్డిపల్లి గుట్టలో అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తూ రూ. కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఆత్మకూరులో డెయిరీ పేరిట మహిళల నుంచి రూ.10 కోట్లు వసూలు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మండల ఇన్‌చార్జి బాలాజీ, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, రాప్తాడు మండల కన్వీనర్ కొండప్ప, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎంపీటీసీ జాఫర్, బీసీ సెల్ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


రాప్తాడులో ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత



# మార్చి 3న పల్స్ పోలియో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 3:** జిల్లాలో మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మార్చి 3 నుంచి 5వ తేదీవరకు మూడు రోజుల పాటు పల్స్ పోలియో చేపడుతున్నామని అన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కార్యక్రమాన్ని కొనసాగించాలని సూచించారు. సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయాలని అన్నారు. అంగన్‌వాడీలు, ఆశాల ద్వారా ఆ వయసు పిల్లలందరి సమాచారం సేకరించి సిద్ధం చేసుకోవాలని అన్నారు. తొలిరోజు పోలియో చుక్కలు వేయించుకోనివారిని గుర్తించి, మిగిలిన రెండు రోజులు ఇళ్ల వద్దకు సిబ్బందిని పంపించి చుక్కలు వేయించాలని అన్నారు. పోలియో చుక్కలు వేసేటపుడు పిల్లలపై నేరుగా సూర్యరశ్మి పడకుండా, నీడలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. పల్స్ పోలియోను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, వందశాతం విజయవంతం చేయాలని, మెడికల్ ఆఫీసర్లు కీలకంగా వ్యవహరించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, డాక్టర్ గంగాధర రెడ్డి, డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ మురారి, పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

# తాగి వచ్చావా..?

### కార్యకర్తపై రాప్తాడు ఎమ్మెల్యే మండిపాటు

**ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 3:** సమస్యలపై ప్రశ్నించిన సొంత పార్టీ కార్యకర్తపై 'తాగి వచ్చావా..?' అంటూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసరా చెక్కులను పంపిణీ చేసేందుకు కనగానపల్లి మండలంలో చంద్రాచెర్ల గ్రామానికి ఎమ్మెల్యే శనివారం వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైసీపీ కార్యకర్త బోయ శివయ్య హౌసింగ్ బిల్లుల గురించి ఎమ్మెల్యేని ప్రశ్నించారు. 'మాకు హౌసింగ్ బిల్లులు మంజూరు కాలేదు. ఒకే వర్గం వారికి రెండు మూడు ఇళ్లకు బిల్లులు మంజూరు చేశారు. మాకు ఇల్లు లేదు. జలకళ పథకం కింద దరఖాస్తు చేసినా.. పొలంలో బోరు కూడా వేయలేదు' అని ఎమ్మెల్యేతో అన్నారు. దీంతో ఆసహనానికి గురైన ఎమ్మెల్యే, శివయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తాగివచ్చి మాట్లాడుతున్నావా? ఇక్కడ ఉన్న విషయం మాట్లాడు. అల్లర చేయడానికి వచ్చావా?' అని మండిపడ్డారు. దీంతో అక్కడున్న పోలీసులు శివయ్యను దూరంగా నెట్టేశారు. ఎమ్మెల్యే తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలని, ఇలా దూషించడం ఏమిటని అసంతృప్తి వ్యక్తం చేశారు.


ఎమ్మెల్యేని ప్రశ్నిస్తున్న కార్యకర్తను అడ్డుకుంటున్న పోలీసులు

# వేతనాలు

## సచివాలయ ఉద్యోగులకు 8 నెలలుగా అందని వేతనాలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- పామిడిని పంచాయతీగా మార్చడంతోనే సమస్య
- ఇబ్బంది పడుతున్న 14మంది ఉద్యోగులు



**అనంతపురం సిటీ, ఫిబ్రవరి 3:** జిల్లాలోని పామిడి గ్రామ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న 14 మంది ఉద్యోగులు ఎనిమిది నెలలుగా జీతం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారు జీతం లేక ఇతర ఉద్యోగాల్లోకి పోలేక.. నానా అవస్థలు పడుతున్నారు. పామిడిని మున్సిపాలిటీ నుంచి పంచాయతీగా మార్పు చేయడంతోనే ఈ సమస్య తలెత్తిందని ఉన్నతాధికారులు చెబుతుండటంపై ఆ ఉద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు.

### పరిష్కారం ఏదీ..?

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులను గత ఏడాది జూన్‌లో ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో 14మంది సచివాలయ ఉద్యోగులను పామిడి మండల కేంద్రంలోని సచివాలయాలకు బదిలీ చేశారు. వీరిలో డిజిటల్ అసిస్టెంట్‌లు ఇద్దరు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఏడుగురు, మహిళా పోలీసులు ఐదుగురు ఉన్నారు. బదిలీల సమయంలో ప్రభుత్వం పామిడి మున్సిపాలిటీని పంచాయతీగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉద్యోగులకు మాత్రం పామిడి మున్సిపాలిటీలోని సచివాలయాల్లో అని బదిలీ ఆర్డర్స్ ఇచ్చింది. వారందరూ విధుల్లో చేరిపోయారు. అయితే నెల గడిచినా మిగతా ఉద్యోగులతో పాటు తమకు జీతాలు అందకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సంబంధిత శాఖల ఉన్నతాధికారులను అడిగితే పామిడిని మున్సిపాలిటీ నుంచి పంచాయతీగా మార్పు చేశారు. మీకు జీతాలు ఇవ్వాలంటే.. జిల్లా కలెక్టర్, ప్రభుత్వంతో అనుమతి తీసుకుని ఇవ్వాలి. అంతేకాకుండా పామిడి ఎంపీడీఓ ద్వారా వేతనాలు డ్రా చేయాల్సి ఉంటుందన్నారు. దీంతో ఈ 14 మంది ఉద్యోగులు అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంపీడీఓ, పీఆర్, డీపీఓ, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ అర్జీలు పెడుతున్నారు. ఉన్నతాధికారులను గట్టిగా అడిగితే విధుల్లో ఏమైనా ఇబ్బంది పెడుతారేమోనని లోలోపలే కుమిలిపోతున్నారు. మీకు జీతాలు రావడం లేదు. కదా..? ఉద్యోగం వద్దు.. ఏమీ వద్దు. మానేయండి అని ఇంటి పెద్దల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు జీతాల సమస్యను జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారో లేదో అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఇబ్బందిగా ఉంది: ఓ ఉద్యోగి



గతంలో పనిచేసిన చోట ప్రతి నెలా జీతం వచ్చేది. మా ఇంట్లో ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. పామిడిలో ఎప్పుడైతే విధుల్లో చేరినానో.. అప్పటి నుంచి జీతాలు రాలేదు. 8 నెలలు పాటు జీతాలు రాకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. నానా అవస్థలు పడుతూ కుటుంబ పోషణ సాగిస్తున్నా..

### ● మహిళా ఉద్యోగులకు చాలా ఇబ్బందిగా ఉంది

నెల నెలా జీతం వచ్చే సమయంలో ఎలాంటి సమస్య తలెత్తలేదు. కానీ 8 నెలలుగా జీతాలు రాకుండా నేటికి ఉద్యోగానికి వెళ్తుంటే మా ఇళ్లలో పలు రకాల సమస్యలు తలెత్తుతున్నాయి. జీతాలు రావడం లేదు కదా..? ఉద్యోగం మానేయండి అని ఇంట్లో వాళ్లు ఒత్తిడి పెడుతున్నారు. మహిళలకు జీతం రాకపోతే నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లా కలెక్టర్ మా సమస్యపై స్పందించి వెంటనే జీతాలు వచ్చే విధంగా చూడాలి.

**- ఓ మహిళా ఉద్యోగి**

### ● బదిలీపై రావడమే మా తప్పా?


గతంలో పనిచేసిన చోటే ఉండి ఉంటే ఎలాంటి సమస్య ఉండేదికాదు. ఈ పరిస్థితి చూస్తుంటే బదిలీపై ఇక్కడికి రావడమే మేము చేసిన తప్పు అనే విధంగా ఉంది. అధికారులు చూస్తే.. మున్సిపాలిటీ నుంచి పంచాయతీగా మారడంతోఏ సమస్య ఏర్పడింది అని చెబుతున్నారు. మాకు, మార్పునకు ఏం సంబంధం. ఇవన్నీ అధికారులు, ప్రభుత్వం చూసుకోవాలి. **- ఉద్యోగి**

# సిత్రాలు సూడరో..!

- ఫొటోకు బదులుగా ఆధార్ కార్డు
- రెండు నియోజకవర్గాల జాబితాల్లో పేర్లు
- తప్పుల తడకగా ఓటర్ల తుది జాబితా

**కదిరి, ఫిబ్రవరి 3:** ఎన్నికల జాబితాలో చిత్రవిచిత్రాలు కనిపిస్తున్నాయి. కొందరు ఓటర్ల ఫొటోలకు బదులు అధార్ కార్డులను అప్‌లోడ్ చేశారు. మరికొందరికి రెండేసి నియోజకవర్గాల్లో ఓటు హక్కు కల్పించారు. ఒకే నియోజకవర్గంలో రెండు మూడు చోట్లా పేర్లను చేర్చారు.



ఫొటోలకు బదులు అధార్‌కార్డు అప్‌లోడ్ చేసిన జాబితా

- కదిరి పట్టణంలోని మారుతి నగర్ 67వ పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్లు 536, 555, 666, 669లో ఓటర్ల ఫొటో బదులుగా అధార్ కార్డును అప్‌లోడ్ చేశారు. 94వ పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 306లో డి.ఝున్సీ లక్ష్మీబాయి ఓటరుగా ఉన్నారు. ఈమె పేరును పుట్టపర్తి నియోజకవర్గం లోని 138 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 463 కింద డుంగావత్ ఝూన్సీలక్ష్మీబాయిగా నమోదు చేశారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలోని 139వ నంబరు పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 196 జయరామిరెడ్డి, 194లో వై.శివమ్మ, 197 రమేష్ కుమార్‌రెడ్డి, 195 త్రివేణి ఓటర్లుగా ఉన్నారు. వీరు కదిరి నియోజకవర్గం ఓటరు జాబితాలోనూ ఉన్నారు. 86వ పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 223తో రమేష్ రెడ్డి, 82వ పోలిం గ్ కేంద్రంలో 419 సీరియల్ నంబర్‌తో త్రివేణి, 88 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 305తో శివమ్మ, సీరియల్ నంబర్ 207తో జయరామిరెడ్డి ఓటర్లుగా నమోదు అయ్యారు.




కదిరి నియోజవర్గంలో ఓటర్లుగా నమోదు అయిన జాబితా

- కదిరి నియోజకవర్గంలోని 69 పోలింగ్ కేంద్రంలో 545 సీరియల్ నంబర్‌తో డి. జయలక్ష్మి, 543 సీరియల్ నంబర్‌తో రజని సాయితేజ, 541 సీరియల్ నంబర్‌తో పురుషోత్తం పేర్లు నమోదు అయ్యాయి. పుట్టపర్తి నియోజకవర్గంలోని 140వ పోలింగ్ కేంద్రంలో 389, 384, 385 సీరియల్ నంబర్లతో వీరి పేర్లే ఉన్నాయి.
- గాండ్లపెంట మండలంలోని 162, 163 పోలింగ్ కేంద్రాల పరిధిలో పోత చైతన్య కుమార్‌రెడ్డి, పోత శ్రావణ్‌కుమార్‌రెడ్డి పేర్లు ఉన్నాయి.

## తప్పుల తడకగా ఓటరు జాబితా

**కణేకల్లు, ఫిబ్రవరి 3:** మండలంలో పూలచెర్ల గ్రామంలో వెలువడిన ఓటరు జాబితా తప్పుల తడకగా ఉన్నట్లు ఓటర్లు ఆరోపించారు. స్థానిక బీసీ కాలనీలో దాదాపు 15 మందికి ఓటరుజాబితాలో మండలం పేరు స్థానంలో కణేకల్లు ఉండాల్సి ఉండగా కళ్యాణదుర్గం మండలంగా నమోదైంది. ప్రధానంగా 138వ బూత్‌లో ఇలాంటి తప్పులు దొర్లాయి. అలాగే ఓటరు కార్డులో ఓటరు ఫోటో బదులు ఆధార్‌కార్డును ముద్రించారు. ఇలా 138వ బూత్‌లో ఓటరుజాబితాలో అనేక తప్పులు దొర్లడంతో ఓటర్లు తికమకకు గురవుతున్నారు. వెంటనే వాటిని సరిచేయాలని ఓటర్లు అధికారులను కోరుతున్నారు.



ఓటరు ఫొటో బదులు ఆధార్‌కార్డు వచ్చిన దృశ్యం

## సైబర్ నేరగాళ్లను పట్టేసిన పోలీసులు

- బిహార్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరస్థుల అరెస్ట్
- రిజిస్ట్రార్ ఆఫీసుల వెబ్‌సైట్ల ఆధారంగా...
- 3నెలల కాలంలో 300బ్యాంకు ఖాతాల నుంచి రూ. 39.48లక్షల కాజేసినట్లు లావాదేవీల గుర్తింపు



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3:** సైబర్ నేరగాళ్లను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు. బీహార్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్ట్ చేశారు. ఏఈపీఎస్(ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్)ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు నొక్కేస్తున్నట్లు నిర్ధారించారు. మూడు నెలల కాలంలో ఈ ముఠా సభ్యులు 300 మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.39,48,304 కాజేసినట్లు గుర్తించారు. 13 నెలల నుంచి ఎన్‌సీఆర్‌పీ, 1930 నెంబర్లకు జిల్లా నుంచి 1484 ఫిర్యాదులు, ప్రజల ఖాతాల నుంచి రూ.2,16,26,472 సైబర్ నేరగాళ్లు మాయం చేసినట్లు తేల్చారు. ఇదివరకు జమ్ముకశ్మీర్, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో దాక్కున్న సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రం పూర్ణియ జిల్లా మహరాజ్పూరకు చెందిన నూర్ ఇస్లాం, పూర్ణియ జిల్లాకు చెందిన మహమ్మద్ ఇస్రాఫిల్‌లను అరెస్ట్ చేశారు. పూర్ణియ జిల్లాకే చెందిన జబ్బుద్దిన్ పరారీలో ఉన్నాడు.

**ముఠా సైబర్ నేరాలకు పాల్పడిన తీరు...**

ఈ ముఠా సభ్యులు రిజిస్టర్ ఆఫీసుల వెబ్‌సైట్ల ద్వారా డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకుంటారు. వీటిలో ఉన్న ఫింగర్‌ప్రింట్స్, ఆధార్ కార్డు నంబర్లను సేకరిస్తారు. విదేశాల నుంచి తెప్పించుకున్న కొన్ని కెమికల్స్ ఉపయోగించి బాధితుల వేలి ముద్రలు పోలిన నకిలీ వేలిముద్రల నమూనాను తయారు చేసుకుంటారు. ఏఈపీఎస్ యంత్రాన్ని సిద్ధం చేసుకుని తద్వారా బాధితుడికి సంబంధించిన నకిలీ వేలిముద్రలు, ఆధార్ నెంబర్ సహాయంతో, ఆధార్ నెంబర్‌తో అనుసంధానించిన బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి రూ.10వేల చొప్పున సుమారు 300 మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.39,48,304 కాజేశారు. ఈ సొమ్మును ప్రస్తుతం అరెస్టయిన ఇద్దరితో పాటు పరారీలో ఉన్న నిందితుడు కలిసి సమానంగా పంచుకున్నారు. ఎట్టకేలకు వారిలో ఇద్దరిని పట్టుకున్నారు.

# ఇదేం పద్ధతి రెడ్డీ!

- జలవనరుల శాఖ అధికారులపై ఇన్‌చార్జి మంత్రి ఒత్తిడి
- జిల్లా జలాశయాలు నింపకముందే చిత్తూరుకు కృష్ణా జలాల తరలింపు
- అడుగంటిన స్థానిక రిజర్వాయర్లు ● ఉమ్మడి జిల్లాకు పొంచి ఉన్న నీటి ముప్పు


**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3:** జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిడితో జిల్లాలో రిజర్వాయర్లు నిండకముందే కృష్ణా జలాలను చిత్తూరు జిల్లాకు తరలించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. జలవనరుల శాఖ అధికారులు, ఇంజనీర్లకు ముందుచూపు కొరవడటం, జిల్లా ప్రజాప్రతినిధులు ప్రశ్నించకపోవడం కూడా నీటి సమస్యకు ఓ కారణమే. రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలే ఈ విషయాన్ని చెబుతున్నాయి. ఇప్పటికే వందలాది గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. జిల్లాలో తాగునీటికి ప్రధాన నీటి వనరుగా ఉన్న పీఏబీఆర్‌లో నీటి నిల్వ సాధారణం కంటే దిగువకు చేరింది. పీఏబీఆర్ నీటి నిల్వ సామర్థ్యం 11టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 1.925టీఎంసీలు మాత్రమే ఉండటం ఆందోళన కలిగించే అంశం. జిల్లాలోని రిజర్వాయర్లను నింపకముందే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిడితో కృష్ణా జలాలను చిత్తూరు జిల్లాకు తరలించడమే నీటి ఎద్దడికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సాధారణంగా వేసవిలో తాగునీటి అవసరాల కోసం ఉమ్మడి జిల్లాకు 12టీఎంసీల వరకు నిల్వ ఉంచాలి. అయితే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న రిజర్వాయర్లలో 6టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది. ప్రతి ఏటా ఉమ్మడి జిల్లాకు తాగునీటి ఎద్దడి నివారణకు కృష్ణా జలాలు మళ్లించేవారు. అయితే ఈ దఫా శ్రీశైలం డ్యాంలో నీటి నిల్వ తక్కువగా ఉండటంతో హంద్రీనీవాకు 40టీఎంసీలకుగాను 16టీఎంసీలే కేటాయించారు. దీంతో హంద్రీనీవా కింద ఉన్న జలశయాలు సైతం అడుగంటి పోయాయి.



జీడిపల్లి రిజర్వాయర్‌లోని గుంతల్లో ఉన్న నీరు

**అడుగంటిన జలాశయాలు**

జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు అడుగంటిపోయాయి. వీటిలో జీడిపల్లి 1.68టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.4టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గొల్లపల్లి 1.91టీఎంసీలు కెపాసిటీ కాగా ప్రస్తుతం 1.1టీఎంసీలు, మారాల 0.45టీఎంసీలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 0.2టీఎంసీలు, చెర్లోపల్లి 1.608టీఎంసీలు సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.8టీఎంసీల నీరు నిల్వ ఉంది. వీటితో పాటు పేరూరు డ్యాం 1.810టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.450టీఎంసీలు, భైరవానితిప్ప ప్రాజెక్ట్ 2.1టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.250టీఎంసీలు, చాగల్లు రిజర్వాయర్ 1.5టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 0.65టీఎంసీలు, పెండేకల్లు 0.655టీఎంసీలుగా కాగా ప్రస్తుత 0.160టీఎంసీలు, పెనకచెర్ల డ్యాం (ఎంపీఆర్) 5.200టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.429టీఎంసీలు, పీఏబీఆర్ డ్యాం 11,10టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.925టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.



అడుగంటిన పీఏబీఆర్

### నీరు తక్కువగా ఉన్న మాట వాస్తవమే

జిల్లాలో హంద్రీనీవా, హెచ్చెల్సీ పరిధిలోని జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేని మాట వాస్తవమే. తుంగభద్ర డ్యాం, శ్రీశైలం డ్యాంల నుంచి ఈ దఫా హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలకు కేటాయింపులు తక్కువే. జిల్లాకు నీరు వచ్చింది తక్కువే. ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలలో వర్షాలు తక్కువగా రావడంతో కేటాయింపుల్లోనూ కోతలు విధించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు సరిపడ సాగు, తాగునీరు అందుబాటులోకి రాలేదు. అయినా వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

- దేసేనాయక్, రాజశేఖర్, హంద్రీనీవా, హెచ్చెల్సీ ఎస్ఈలు

# అవినీతి మొక్కలు

- పైసలిస్తేనే పండ్ల మొక్కలకు పేమెంట్!
- సుమారు రూ. 25 లక్షల బిల్లులు పెండింగ్
- డబ్బులు ఇవ్వలేదని ఆపేసిన ఉపాధి సిబ్బంది
- అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణ



కళ్యాణదుర్గం మండలంలో సాగు చేసిన చీనీ మొక్కలు

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 3:** కొందరు ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతికి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పైసలిస్తేనే పండ్ల మొక్కలకు పేమెంట్ చేస్తాం...లేకపోతే చేయమని చెబుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలా రైతులకు సంబంధించిన రూ. 25 లక్షల వరకు బిల్లులను అప్‌లోడ్ చేయకుండా పెండింగ్ పెట్టేశారు. ఉపాధి పథకం కింద పండ్ల తోటల రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద గత అక్టోబరు వరకు వారానికి ఒకసారి రైతుల ఖాతాల్లోకి బిల్లులు జమ అయ్యాయి. నవంబరు నుంచి నిధుల లేమితో బిల్లులు ఆగిపోయాయి. బిల్లులు క్రమం తప్పకుండా పడుతున్నప్పుడే పేమెంట్ చేసి ఉంటే రైతులకు ప్రయోజనం చేకూరేది. కనీసం ఇప్పటికైనా బిల్లులను చేశారా అంటే అదీ లేదు. రకరకాల నిబంధనలను పెట్టి రైతులకు డబ్బులు రాకుండా అడ్డుకుంటున్నారు. పథకం కింద ఆరునెలల కిందట మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నా నేటికి పేమెంట్ చేయకుండా ఉపాధి సిబ్బంది రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. కళ్యాణదుర్గం మండలంలో 2022-23 వ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 30 మంది, 2023-24లో 37 మంది రైతులు పండ్లతోటల పెంపకం కింద మామిడి, చీనీ, దానిమ్మ తదితర మొక్కలను సాగు చేశారు. వీరికి క్రమం తప్పకుండా నెలకోసారి నీరు, ఎరువులు, దున్నకం తదతర బిల్లులను చేయాల్సి ఉంటుంది. తీవ్ర కరువు నేపథ్యంలో రైతులు ఎన్నో వ్యయప్రయాసాలతో మొక్కలకు నీటి తడులు ఇచ్చి పంటను కాపాడుకుంటున్నారు. బిల్లుల కోసం ఉపాధి హామీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా సిబ్బంది కనికరించడం లేదు. గత అక్టోబరు వరకూ వారానికోసారి బిల్లులు పడినా, అప్పుడు పేమెంట్ చేయకపోవడంతో రైతులు నష్టపోయారు. ఇప్పటివరకు జనవరిలో తిమ్మసముద్రం పంచాయతీలో 9 మంది రైతులు, మానిరేవులో నలుగురు, గోళ్లలో ఇద్దరు, బోరంపల్లి, గరుడాపురం, కొత్తూరు, ముద్దినాయనపల్లిలో ఒక్కొక్కరి చొప్పున కేవలం 19 మంది రైతులకు ఈ ఏడాది జనవరిలో పేమెంట్ చేశారు. ఇప్పటివరకు రైతులకు మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.7.80 లక్షల పేమెంట్ చేశారు. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు 45 మంది రైతులకు ఒక్కరూపాయి కూడా పేమెంట్ చేయలేదు. తమకు పేమెం ట్ చేయాలని రైతులు మొరపెట్టుకుంటున్నా ప్రయోజనం లేకుం డా పోతోంది.

**డబ్బులు అడుగుతున్నారన్నది అవాస్తవం**
**- రామచంద్ర రెడ్డి, ఇన్‌చార్జ్ ఏపీవో, కళ్యాణదుర్గం**

పండ్లమొక్కల బిల్లులు చేయడానికి డబ్బులు అడుగుతున్నారన్నది పూర్తిగా అవాస్తవం. ఏదైనా సమస్య ఉంటే స్వయంగా పండ్ల మొక్కల రైతులే ఎంపీడీవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. జనవరి వరకు పూర్తిస్థాయిలో పండ్లమొక్కలకు బిల్లులను అప్‌లోడ్ చేశాం.

## మంత్రి ఉష శ్రీచరణ్‌కు సొంతపార్టీలో సెగ

పెనుకొండ నియోజకవర్గంలో సహకరించని కార్యకర్తలు

సోమందేపల్లి మండలం చాలకూరులో ఫ్లెక్సీల చించివేత



చాలకూరులో మంత్రి ఫ్లెక్సీలను చించేస్తున్న సర్పంచ్ వర్గీయులు

**పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 3:** 'ఎన్నికల బదిలీపై పెనుకొండ నియోజకవర్గానికి వెళ్లిన మంత్రి ఉష శ్రీచరణ్‌కు సొంతపార్టీవారు చుక్కలు చూపిస్తున్నారు. ఒకరి వద్దకు వెళితే మరొకరు అలుగుతున్నారు. ఓ గ్రామ పంచాయతీలో నాయకులు 'మేం కావాలా..? వారు కావాలా..?' అని పేచీకి దిగడంతో మంత్రి ఏకంగా గంటపాటు నడిరోడ్డుపై కాన్వాయ్ నిలబెట్టుకుని తంటాలు పడాల్సి వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి పర్యటిస్తున్నారు. ఆత్మీయ పలకరింపు పేరిట సోమందేపల్లి మండలంలోని చాలకూరు పంచాయతీకి శనివారం వెళ్లారు. చాలకూరులో భోజన విరామం అనంతరం అసమ్మతి నాయకురాలు అశ్వర్థమ్మ ఇంటికి మంత్రి బయలుదేరారు. దీనికి నిరసనగా మంత్రి వాహనం నుంచి సర్పంచ్ భర్త లక్ష్మీనరసప్ప మధ్యలోనే దిగిపోయారు. తమను కాదని, వ్యతిరేకుల వద్దకు మంత్రి వెళ్లడంతో సర్పంచ్ లలితమ్మ, ఆమె భర్త లక్ష్మీనరసప్ప, వారి అనుచరలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి, తాము ఎంతో నష్టపోయామని అన్నారు. మంత్రి పర్యటనకు జనాన్ని సమీకరించి, నాయకులకు ఏర్పాట్లు చేసిన తమను కాదని.. పార్టీకి వ్యతిరేకించేవారి ఇంటికి మంత్రి ఎలా వెళతారని మండిపడ్డారు. గ్రామంలో మంత్రికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. పంచాయతీ పరిధిలో మంత్రి పర్యటనకు వచ్చేది లేదని, అసమ్మతి నాయకురాలు అశ్వర్థమ్మతోనే కలిసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. విభేదాలకు కారణాలేమిటో, ఎలా సర్దుబాటు చేయాలో తెలియక సుమారు గంటపాటు చాలకూరు సమీపంలోని రోడ్డుపై మంత్రి తన వాహనంలో ఉండి మంతనాలు జరిపారు. జెడ్పీటీసీ డీసీ అశోక్, వైసీపీ మండల మాజీ కన్వీనర్ వెంకటరత్నం, పోలీసులు సర్పంచ్ వర్గీయులకు నచ్చజెప్పినా వినలేదు. దీంతో చేసేది లేక చాలకూరు పంచాయతీ పరిధిలోని గుడ్డం నాగేపల్లి గ్రామానికి మంత్రి వెళ్లకుండా, బాపనపల్లి పంచాయతీకి వెళ్లారు. మంత్రి పర్యటనలో వివాదాలను చిత్రీకరిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విలేకరిపై మంత్రి తన గన్‌మెన్‌ను ఉసిగొల్పారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విలేకరి సెల్‌ఫోన్‌ను గన్‌మెన్ లాక్కుని, వీడియోలు డిలీట్ చేసే ప్రయత్నం చేశారు. మంత్రి పర్యటన దృశ్యాలను చిత్రీకరించడం తమ విధిలో భాగమని, ఇలా వ్యవహరించడం తగదని తోటి విలేకరులు అభ్యంతరం చెప్పడంతో వెనక్కు తగ్గారు.



చాలకూరు వద్ద రోడ్డుపై మంత్రి వాహనం

# ఎప్పటిలానే రుస రుస !

- టీచర్లపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆగ్రహం
- హిందూపురంలో పాఠశాలల తనిఖీ
- ఎస్ఏ-3 పేపర్లు దిద్దకపోవడంపై ఆగ్రహం
- డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓల పనితీరుపై అసహనం



ఖాళీగా ఉన్న రికార్డు పుస్తకాలను విద్యాశాఖ అధికారులకు చూపుతున్న ప్రవీణ్ ప్రకాష్

**హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 3:** 'వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు. అలాంటపుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎందుకు అందించరు? దేశంలో ఏ ప్రైవేట్ పాఠశాలలో కూడా ఉపాధ్యాయులకు రూ.50 వేలు జీతాలు ఇవ్వడంలేదు. మన రాష్ట్రంలో ప్రభు త్వ ఉపాధ్యాయులకు రూ.50 వేలపైనే జీతాలు అందుతున్నాయి. అలాంటప్పుడు బాధ్యతగా ఎందుకు పని చేయడం లేదు' అని ఎప్పటిలాగే ఉపాధ్యా యులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్‌ప్రకాష్ మండిపడ్డారు. హిందూపురంలో శనివారం ఆయన పలు పాఠశాలలు తనిఖీ చేశారు. పట్టణంలోని నేతాజీ మునిసిపల్ హైస్కూ ల్, పళనీనగర్‌లోని ప్రకాశం పంతులు ప్రాథమిక పాఠశాల, రూరల్ మండలంలోని సంజీవరాయనపల్లి ప్రాథమిక పాఠశాల, అనంతరం పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా మడకశిర, రొళ్ల, అగళి మండలాల్లో పర్యటిస్తారని సమాచారం. అయితే శుక్రవారం రాత్రి హిందూపురంలో ఉంటారని డీఈఓ మీనాక్షికి ఫోన్ వెళ్లడంతో బస ఏర్పాట్లు చేశారు. ఉద యం హిందూపురంలోనే తనిఖీలు చేస్తానని ఉన్న ఫలంగా చెప్పి నేతాజీ పాఠశాలకు వెళ్లారు. అక్కడ పాఠశాల తనిఖీ చేసి 8, 9 తరగతుల ఉపాధ్యాయులతో మాట్లాడారు. జనవరి 23 నుంచి 26 వరకు ఎస్ఏ 3 పరీక్షలు జరిగాయి. ఫిబ్రవరి 3వ తేదీ లోపల పరీక్షల పేపర్లు దిద్ది మార్కులు రికార్డు చేయాల్సి ఉంది. ఉపాధ్యాయు లు రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని వారిపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఏమిచేస్తున్నారో చూడాల్సిన బాధ్యత మీకు లేదా అని సంబంధిత ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓలపై ఆగ్రహం వ్యక్తం చే శారు. హిందూపురంలో ఎంఈఓ గా ఎనిమిదేళ్లు పని చేసి కూడా బాధ్యతగా నడుచుకోలేదని ఎంఈఓ గంగప్పపై ఫైర్ అయ్యాడు. వర్కు బుక్కులు ఖాళీగా ఉండటంతో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు క్లాస్ పీకారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్జేడీ వెంకట క్రిష్టారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి, డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓ గంగప్పతో పాటు లేపాక్షి, చిలమత్తూరు ఎంఈఓలు ఉన్నారు.

## వైసీపీ ఆవిర్భావానికి చంద్రబాబే కారణం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

**హిందూపురం, ఫిబ్రవరి 3:** వైసీపీ ఆవిర్భావానికి చంద్రబాబే మూల కారణమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను తమ పార్టీకి శత్రువుగానే భావిస్తామని అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో వార్డులవారీగా జరిగిన పార్టీ సమీక్షా సమావేశాలకు శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కుట్రలో భాగంగానే జగన్‌ను షర్మిల విమర్శిస్తున్నారని ఆరోపించారు. షర్మిల మాట్లాడిన మొదటిరోజే తాను ఈ విషయం చెప్పానని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోవడానికి, వైఎస్ఆర్ కుటుంబంలో చిచ్చు రేగడానికి, చివరకు వైసీపీ ఆవిర్భావానికి కూడా చంద్రబాబే కారణమని అన్నారు. కాంగ్రెస్ ఒకప్పుడు బలంగా ఉండేదని, ఇప్పుడు ఆ పార్టీ చచ్చిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ శవాన్ని రఘువీరారెడ్డి, షర్మిల, కేవీపీ రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు అనే నలుగురు మోస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ శవం ముందు ఉట్టి పట్టడానికి మరొకరు ఉండవచ్చునని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ బతికి బట్టకట్టలేదని, ఆ పార్టీలోని వారంతా వైసీపీలో ఉన్నారని అన్నారు.


సీకేపీలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ నాయకులు

## నేడు సీకేపీలో జయహో బీసీ

**చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 3:** స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నామని టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి ఎజ్జే శంకర్, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, ప్రధాన కార్యదర్శి ముత్యాలప్ప తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారు శనివారం మాట్లాడుతూ... మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఈ సదస్సును నిర్వహిస్తున్నామని, మండలంలోని బీసీ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలుగుమహిళలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**సిండికేట్‌నగర్‌లోనూ...**

**అనంతపురం రూరల్ :** మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు జింకా సూర్యనారాయణ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బ్యాళ్లరాము శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ నాయకులు, బీసీలందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## 6న చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

**పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి**



**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3:** సర్పంచుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టామని, ఉమ్మడి జిల్లా నుంచి సర్పంచులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి కోరారు. శనివారం స్థానిక తన నివాసంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన రూ.8,629 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా దారిమళ్లించిందన్నారు. ఆ నిధులను తిరిగి సర్పంచుల ఖాతాలకు జమ చేయాలని పలు రూపాల్లో ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడు తున్నామన్నారు. హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## ఇది దగా డీఎస్సీ : జనసేన

**అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 3:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ కాదని, అది ఓ దగా డీఎస్సీ అని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. శనివారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా.. 9వ డివిజన్‌లోని భవానీనగర్‌లో పర్యటించి స్థానిక కాలనీవాసులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్‌రెడ్డి మాటలు నమ్మి మోసపోయిన నిరుద్యోగ యువత కన్నీరుపెడుతోందన్నారు. నిరుద్యోగ యవతకు జనసేన, టీడీపీ పార్టీలు అండగా ఉంటాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ పోస్టులతో పాటు ప్రభుత్వం రంగంలో ఉన్న అన్ని రకాల పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధానకార్యదర్శి పెండ్యాల చక్రపాణి, నాయకులు సాయి, హర్షద్, వీర మహిళలు కళ్యాణి, సుమలత, శైలజ, గురులక్ష్మి, శశికళ, సానియా, గాయత్రి పాల్గొన్నారు.

## వీఏఏ పూజితకు నివాళి

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3:** ఆర్బీకే అద్దె భవన యజమాని, అధికారుల ఒత్తిళ్లతో ఆత్మహత్య చేసుకున్న బాపట్ల జిల్లా చావలి గ్రామ వ్యవసాయ సహాయకురాలు (వీఏఏ)కు గ్రామ సచివాలయ సిబ్బంది కొవ్వొత్తులతో నివాళులర్పించారు. శనివారం రాత్రి స్థానిక కృషి భవన్ వద్ద గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పూజిత చిత్రపటానికి పూల మాలలు వేసి, కొవ్వొత్తులు ప్రదర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. లక్ష్మినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ , నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్యాజ, ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్ , సచివాలయ సిబ్బంది పుల్లప్ప, గంగాధర్, కవిత పాల్గొన్నారు.

## ఫెన్సింగ్ నేషనల్ మీట్‌కు ఒకేషనల్ కాలేజ్ విద్యార్థి


ప్రణవ్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 3:** స్థానిక న్యూటౌన్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి ప్రణవ్ కుమార్ మహారాష్ట్రలో జరిగే ఫెన్సింగ్ నేషనల్ మీట్‌కు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరప్రసాద్ శనివారం తెలిపారు. ప్రణవ్ నవంబరులో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడని, దీంతో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 7 నుంచి 10 వరకూ నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 17 ఫెన్సింగ్ నేషనల్ మీట్‌లో పాల్గొంటాడని తెలిపారు.

## పశుసంవర్ధక సహాయకులకు త్వరలో పోస్టింగ్..!

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3:** ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక శాఖ పరిధిలో 403 పశుసంవర్ధక సహాయకుల స్థానాలు ఖాళీగా ఉన్నట్లు ఆ శాఖ అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఇటీవల రెండు విడతల్లో 442 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించగా.. 402 మంది అభ్యర్థులకు అర్హత ఉన్నట్లు నిర్ధారించారు. ఇదివరకు పనిచేస్తున్న 171 పశుసవర్ధక సహాయకులకు స్థానచలనం కల్పించారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో అనంతపురం డివిజన్‌లో 120, ధర్మవరం డివిజన్‌లో 57, హిందూపురం డివిజన్‌లో 28 , పెనుకొండ డివిజన్‌లో 59, ఉరవకొండ 139 మొత్తం 403 పశుసంవర్ధక సహాయకుల స్థానాలు ఖాళీల జాబితాను విడుదల చేశారు. కొత్త అభ్యర్థులు ఖాళీగా ఉన్న స్థానాలను ఎంచుకొని ఆప్షన్లు ఇస్తే వచ్చే వారంలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

## ముగిసిన న్యాక్ పీర్ పర్యటన

**అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 3:** జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో న్యాక్ ఎక్స్‌పర్ట్ టీమ్ రెండు రోజుల మాక్ ఆడిట్ పర్యటన శనివారంతో ముగిసింది. ఇంజనీరింగ్ కోర్సులంటేనే రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్న నేటి పరిస్థితుల్లో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కేవలం రూ.10వేల సంవత్సర ఫీజుతో సాంకేతిక విద్యనందిస్తుండటం హర్షణీయమని ఆ బృంద సభ్యులు కొనియాడారు. ఇలాంటి కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు రాకపోతే సమాజానికే నష్టమని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, విభాగాల అధిపతులు, పలువురు ప్రొఫెసర్‌లతోపాటు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.

# వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం

**29న ప్రజాచైతన్య సభ : పీఆర్ఎస్**


పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

**అనంతపురం ప్రెస్‌క్లబ్ / క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3:** ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కు తీసుకెళ్లిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ప్రజారక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలను చైతన్యం చేసేందుకు ఈనెల 29న ప్రజాచైతన్య సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ప్రజారక్షణ సమితి నాయకులతో కలిసి ఆ కరపత్రాలను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోగా, మరిన్ని సమస్యలను సృష్టిస్తూ, వేధింపులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులను ఆదుకోవడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం దారుణమన్నారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్, నిత్యావసర ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీని జగన్ పూర్తి విస్మరించారని మండిపడ్డారు. ఐదేళ్ల పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయని జగన్ ఎన్నికల సమయంలో నోటిఫికేషన్ల పేరుతో మరోసారి నిరుద్యోగ యువతను మోసం చేయడానికి యత్నిస్తున్నాడని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఆకాంక్షించే అన్ని వర్గాల ప్రజలు ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే ప్రజాచైతన్యసభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి అనంత జిల్లా ఇన్‌చార్జ్ సామ్రాట్ మధు మాదిగ, బేడ, బుడగ జంగం అంజి, మల్లి, రజక సంఘం నాయకుడు కసాపురం ఆంజనేయులు, వడ్డెర సంఘం నాయకులు కుళ్లాయప్ప, అంజి, హనుమంతు, ఇమామ్, షరీఫ్ పాల్గొన్నారు.

## వైసీపీ ఓటమే లక్ష్యం : జనసేన

**అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 3:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నారాయణపురం, రాజీవ్‌కాలనీ పంచాయతీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు, కష్టాలు తెలుసుకోవాలని, జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వాటిని పరిష్కరిస్తామని వారిలో భరోసా నింపాలని అన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలు, వాటివల్ల జరిగే ప్రయోజనాలు ప్రజలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా కార్యదర్శులు సంజీవరాయుడు, రాపా ధనుంజయ, నగర ఉపాధ్యక్షుడు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, వల్లంశెట్టి వెంకట రమణ, వీర మహిళలు అనసూయ, నాయకులు చిరు, బళ్లారి అనిల్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం :** నార్పల మండలం గూగూడులో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి టీసీ వరుణ్ రూ. 10 వేలు విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల నాయకులు సాకే మురళీకృష్ణ, గంజికుంట రామకృష్ణ, ఎర్రిస్వామి, దేవేంద్ర, సాయి, అయ్యప్ప, సన్నీరాజు, కుళ్లాయప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం ఇస్తున్న టీసీ వరుణ్

# తహసీల్దార్ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3:** విశాఖపట్నంలో తహసీల్దార్ రమణయ్య హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జిల్లా క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు పగడాల మల్లికార్జున డిమాండ్ చేశారు. రమణయ్య హత్యకు నిరసనగా శనివారం స్థానిక కృష్ణకళామందిరంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. రమణయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**అనంతపురం టౌన్ :** తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు దివాకరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్, ఆర్డీఓ ఆఫీస్, రెవెన్యూభవన్‌లో రెవెన్యూ ఉద్యోగులు నిరసనలు చేపట్టారు.


విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుల నిరసన

## 6న బండ్లపల్లికి షర్మిల రాక

**నార్పల, ఫిబ్రవరి 3:** మండలంలోని బండ్లపల్లి గ్రామానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల నిర్వహించే రచ్చబండ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా'

**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో పురుషుల విభాగంలో బ్యాడ్మింటన్ గుంతకల్లు, క్రికెట్ అనంతపురం, కబడ్డీ అనంతపూర్, కో-కో ఉరవకొండ, వాలీబాల్ శింగనమల జట్లు నిలిచాయి. మహిళా విభాగంలో బ్యాడ్మింటన్‌లో గుంతకల్లు, క్రికెట్ శింగనమల, కబడ్డీ అనంతపురం, కో-కో రాయదుర్గం, వాలీబాల్ అనంతపురం జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతులను కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అందజేశారు.

## 'ఏపీ ప్రైవేటు టీచర్స్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3:** ఏపీ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చెన్నకేశవులును పలువురు నాయకులు సన్మానించారు. శనివారం స్థానిక కోర్టు రోడ్డులోని కార్యాలయంలో న్యాయవాది హరి, ఏపీపీటీడబ్ల్యూఏ నాయకుడు ఆనంద్‌బాబు, ఏపీవీబీఎస్ నాయకులు నరసింహ, శివ, నంద, గోపి, హరి, శివశంకర్, రమేష్, భాస్కర్, రవి, వెంకటరమణ ఆయన్ను సన్మానించిన వారిలోఉన్నారు.

## రూ.56 లక్షల విలువైన 305 సెల్‌ఫోన్ల అందజేత

**అనంతపురం క్రైం :** జిల్లా ఎస్పీ అన్బురాజన్ రూ.56 లక్షల విలువైన 305 సెల్‌ఫోన్లు అందజేశారు. ప్రజలు పోగొట్టుకున్న ఫోన్లను శనివారం ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ఇప్పటివరకు రూ. 13.67 కోట్ల విలువైన 8309 మొబైల్ ఫోన్లను అందజేసినట్లు ఎస్పీ తెలిపారు.

## నీటి సరఫరాకు అంతరాయం

**అనంతపురం క్రైం :** నగరంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశముందని నగరపాలిక ఎస్ఈ రామమోహన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటిని సరఫరా చేసే తాగునీటి మెయిన్ పంపింగ్ పీఏబీఆర్ డ్యామ్ వద్ద మోటర్ల మరమ్మతుల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. నగరంలో రోజు మార్చి రోజు ఇలా వారం రోజుల పాటు సరఫరా చేస్తామని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

## ప్రొహిబిషన్, ఎక్సైజ్ విజిలెన్స్ ఏసీగా బాలకృష్ణన్



**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3:** అనంతపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాలకృష్ణన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌ను ఎక్సైజ్ ప్రధాన కార్యాలయం విజయవాడకు బదిలీ చేశారు. అనకాపల్లి సెబ్ అసిస్టెంట్ కమిషర్ బాలకృష్ణన్‌ను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఏడీసీసీ బ్యాంకు వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న అధికారులు

**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3:** స్థానిక సుభాష్ రోడ్డులోని ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీ బ్యాంకు 106వ వార్షికోత్సవ సభను శనివారం నిర్వహించారు. మొదట కేక్ కట్ చేసిన అధికారులు బ్యాంకు నివేదికను ప్రవేశపెట్టారు. 105 ఏళ్ల పాటు ఆదర్శప్రాయంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల పేదలకు సేవలందిస్తున్న తమ బ్యాంకు కాలానుగుణంగా వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలను అందిస్తోందని అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, పాలకవర్గసభ్యులు జనార్ధన్‌రెడ్డి, సీఈఓ రాంప్రసాద్, జీఎం సురేఖరాణి, డీజీఎం సుఖదేవబాబు, నాబార్డు డీడీఎం అనురాధా, అధికారులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

**నార్పల, ఫిబ్రవరి 3:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఈ సమావేశం మొదలవగానే కొందరు ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను అడిగేందుకు నిరాకరించారు. ముందున్న అధికారులు బదిలీ కావడంతో తమ సమస్యలు తీర్చేది ఎవరని ప్రశ్నించారు. మాజీ ఎంపీటీసీ గొల్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. తమ గ్రామంలో సమస్యలను ఏ అధికారీ పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## పప్పూరులో మహిళ దారుణహత్య


లక్ష్మీనారాయణమ్మ (ఫైల్)

**నార్పల, ఫిబ్రవరి 3:** మండలంలోని పప్పూరులో నెట్టం లక్ష్మీనారాయణమ్మ(52) దారుణహత్యకు గురైంది. ఆమె భర్త నెట్టం రంగప్ప చనిపోవడంతో పిల్లలు లేక ఒంటరిగా ఉండేది. ఆమెకు పప్పూరులో మూడు ఎకరాల పొలం, ఇళ్లు ఉన్నా.. పుట్టినిల్లు అయిన బొందలవాడలో ఉండేది. ప్రతి నెలా పింఛన్ కోసం పప్పూరుకు వచ్చేది. ఎప్పటిలాగే పింఛన్ కోసం ఈనెల ఒకటో తేదీన పప్పూరుకు వచ్చింది. తన పొలానికి వెళ్లివెస్తానని చెప్పిన వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో బంధువులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. శనివారం ఆమె పొలం సమీపంలోని అరటి పొలం నుంచి దుర్వాసన వస్తుండటాన్ని రైతులు గమనించారు. వాసన వస్తున్న ప్రాంతానికి వెళ్లిగా... అరకొరగా తీసిన గోతిలో లక్ష్మీనారాయణమ్మ మృతదేహం ఉండటాన్ని గమనించారు. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, డీఎస్పీ వీరరాఘవరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దుండగులు బండరాళ్లతో ఆమె తలపై మోది... హత్య చేసి.. ఆమె మెడలోని బంగారు చైను, కమ్మలు లాక్కొని వెళ్లినట్లు గుర్తించారు. ఈ హత్య చేసింది నగలు కోసమా.. ఆస్తి కోసమా అనే కోణం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు పరామర్శించారు.

**చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి**

**అనంతపురం క్రైం :** నగరంలోని రాణినగర్‌కు చెందిన రామాంజినేయులు (75) గత నెల 27న విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను శనివారం మరణించాడు.

## వాహన అపహరణకు విఫలయత్నం

**పెద్దవడుగూరు, ఫిబ్రవరి 3:** ఐచర్ వాహనాన్ని అపహరించేందుకు యత్నించిన ఓ దుండగుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కల్యాణదుర్గం బైపాస్‌రోడ్డులో డ్రైవర్ రాము సిమెంట్ లోడ్‌తో ఉన్న ఐచర్ (ఏపీ 37టి3 1699) వాహనాన్ని రోడ్డు పక్కన ఉంచి వెళ్లాడు. గుత్తి మండలం ఆర్ఎస్‌కు చెందిన భాస్కర్ ఆ వాహనాన్ని అపహరించాడు. దీన్ని గుర్తించిన రాము స్థానిక 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ పోలీసులు పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు ఆ వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా.. భాస్కర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. సిబ్బందితో కలిసి ఆ వాహనాన్ని వెంబడించిన ఎస్ఐ.. గుత్తికి వెళ్లే మలుపు వద్ద ఆ వాహనాన్ని అడ్డుకున్నాడు. వాహనంతో పాటు భాస్కర్‌ను అదుపు లోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించారు.

## అనంత సంకల్పం పర్యవేక్షణ బాధ్యత హెచ్ఎంలదే

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 3:** పదో తరగతి పరీక్షల నేపథ్యంలో అనంత సంకల్పం పూర్తిస్థాయి పర్యవేక్షణ బాధ్యత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లదేనని ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు సూచించారు. శనివారం జేఎన్టీయూలోని ఆడిటోరియంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో ఫ్యూచర్ స్కిల్స్‌పై, 10వ తరగతి పరీక్షలకు సమావేశం నిర్వహించారు పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గరపడుతోందని, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం డీసీఈబీ పురుషోత్తం, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసులు, శ్రీదేవి పరీక్షలపై ప్రధానో పాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తర్వాత ఫ్యూచర్ స్కిల్స్‌పై సమావేశం కొనసాగించారు. పది పరీక్షల నేపథ్యంలో అనంత సంకల్పంపై పెద్దగా చర్చించకుండా... ఫ్యూచర్ స్కిల్స్‌పై చర్చ సాగడం విమర్శలకు తావిచ్చింది.

## పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో నీటికష్టాలు

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 3:** పాలకులు, నగరపాలకసంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్ల నగర వాసులు నీటికష్టాలు పడుతున్నారని, రానున్న వేసవిలో ఈ కష్టాలు మరింత తీవ్రం దాల్చనున్నాయని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. నగర ప్రజలకు మంచినీటి కోసం కొరకొళ్ళ డ్యాం నుంచి ముద్దులాపురానికి నీటిని పంపింగ్ చేసే మోటార్లు చెడిపోయి ఆరు నెలలు గడుస్తున్నా నగరపాలక అధికారులు, పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వారి నిర్లక్ష్యం చూస్తుంటే ప్రజల పట్ల వారికున్న శ్రద్ధ అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు వెంటనే స్పందించాలని కోరారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి: జిల్లా జడ్జి


జడ్జికి మిషన్‌ను అందజేస్తున్న సాయిట్రస్ట్ ప్రతినిధులు

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల, పరిశుభ్రత పట్ల శ్రద్ధ చూపాలని జిల్లా జడ్జి శ్రీనివాస్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణంలో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ శానిటరీ పాడ్స్ వెండింగ్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్జిలు హరిత, రాజ్యలక్ష్మి, నిర్మల, సాయి ట్రస్ట్ విజయసాయిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## ముగిసిన జీఎన్ఎం కోర్సు కౌన్సెలింగ్

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 3:** ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం అభ్యర్థులకు సీట్ల కేటాయింపునకు వైద్యశాఖ చేపట్టిన కౌన్సెలింగ్ శనివారంతో ముగిసింది. రెండు రోజుల పాటు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ ఈ.బీ. దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్ కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 620 జీఎన్ఎం సీట్లకు 844 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే అందులో 602 మంది అభ్యర్థులు హాజరై నర్సింగ్ కళాశాలలను కౌన్సెలింగ్ ద్వారా ఎంచుకున్నారు. అభ్యర్థులకు కేటాయించిన కళాశాలల ధ్రువీకరణ పత్రాలను డీఎంహెచ్ఓ అందజేశారు. 19 సీట్లు మిగిలిపోయాయని డీఎంహెచ్ఓ తెలిపారు.

## ఏపీ ఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ భానుమూర్తి

**అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 3:** డిప్లమో కోర్సుల అనంతరం బీటెక్, ఫార్మసీ ద్వితీయ సంవత్సరం ప్రవేశాల పరీక్షలను నిర్వహించే ఏపీఈసెట్-2024 బాధ్యతను రాష్ట్ర ఉన్నత విద్యామండలి జేఎన్‌టీయూకి అప్పగించింది. సెట్ కన్వీనర్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ భానుమూర్తి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను వీసీ శ్రీనివాసరావు, రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్ అభినందించారు. కాగా.. గతేడాది ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2023 బాధ్యతను ఈ వర్సిటీనే చేపట్టిన విషయం తెలిసిందే.

## వైద్యశిబిరానికి విశేష స్పందన

**రామగిరి, ఫిబ్రవరి 3:** అనంతపురానికి చెందిన కిమ్స్ సవేరా ఆస్పత్రి సహకారంతో శనివారం స్థానికంగా నిర్వహించిన గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు స్థానిక అక్కమ్మగార్ల స్వామి ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో వందలాది మంది గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ రాంకుమార్ ఆధ్వర్యంలో ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారన్నారు.

# పేదవిద్యార్థుల సొమ్మునూ వదలనీ వైసీపీ

**సీఎం జగన్‌పై బీజేపీ నేతల మండిపాటు**

**అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 3:** వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ పేద విద్యార్థుల సొమ్ములనూ వదలడంలేదని బీజేపీ నేతలు మండిపడ్డారు. 'మోదీ మాట - హాస్టల్ బాట'ను పురస్కరించుకుని శనివారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమం పేరుతో విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన హాస్టల్స్ నిర్వహణ, నాణ్యమైన విద్యను అందించేం దుకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.వందల కోట్లను రాష్ట్రానికి విడుదల చేస్తోందన్నారు. ఆ నిధులతో పట్టణం నుంచి నగరం వరకు అన్ని వసతి గృహాలకు కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించవ చ్చన్నారు. విద్యార్థు లకు ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, దుస్తులు, పుస్తకాలు అంద జేయాలన్నారు. పౌష్టిక విలువలతో కూడిన భోజనం అందించాలన్నారు. అయితే కేంద్రం నిధులను సీఎం జగన్‌రెడ్డి కాజేశారని, దీంతో విద్యార్థులకు సౌకర్యాలు కరువ య్యాయని, కనీసం వారికి మంచి భోజనం కూడా అందించడం లేదని వాపోయారు. కార్యక్ర మంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, కార్య దర్శి మందల శాంతకుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, నాయకులు జయలక్ష్మి, మిట్టరాజు, అజేష్‌యాదవ్, ప్రసాద్, రామదాసు, సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.


సమస్యలపై విద్యార్థులతో మాట్లాడుతున్న గుడిసె దేవానంద్


మాట్లాడుతున్న జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వీర్రాజు

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వీర్రాజు**

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3:** వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వీర్రాజు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక అనంతపురం ఆర్టీఓ కార్యాలయ ఆవరణంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. రోడ్డు నియమాలు పాటించి విలువైన ప్రాణాలను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు రమణారెడ్డి, శ్రీనివాసులు, సునీత పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 3:** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు పెంచాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇది రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ అని మండిపడ్డారు. ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసిన ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి తీరని ద్రోహం చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టనుందన్నారు. గతంలోనూ మూడు వ్యవసాయ నల్లచట్టాల ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొ రేట్లకు అప్పజెప్పే చర్యలకు వ్యతిరేకంగా పెద్దఎ త్తున ఆందోళనలు జరిగాయని, ఆ సందర్భంలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర నిరుద్యోగ సమ స్య ఉన్నా ఉపాధి ఉత్పత్తికి ఎలాంటి గణనీయమైన కేటాయింపులు లేవన్నారు. ఉపాధి హామీ పథకా నికి నిధుల తగ్గింపు, ఎరువుల సబ్సిడీ తగ్గింపు అన్యాయమన్నారు. కేంద్రప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు ముష్కిన్, పోతులయ్య, సోమర రాహుల్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, సుబ్బిరెడ్డి, ఆదినారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.


కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

## యువతా మేలుకో.. భవిష్యత్తు మార్చుకో..

### టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి


యువతతో పెరుమాళ్ల జీవానందరెడ్డి

**పామిడి, ఫిబ్రవరి 3:** రాష్ట్రంలోని యువత మేలుకొని తమ భవిష్యత్తును తామే మార్చుకోవాలని టీడీపీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి సూచించారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు పెరిగిపోయారన్నారు. పరిశ్రమలు రాకపోవడంతో ఉపాధి అవకాశాలు లేవన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబునాయుడును గెలిపించుకోకపోతే యువత భవిష్యత్తుతోపాటు రాష్ట్ర భవిష్యత్తు చిన్నాభిన్నమవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవ, హరీష్, నాగార్జున, హరి, పాలాక్షిరెడ్డి పాల్గొన్నారు.

## డీఎస్సీ పేరుతో దగా

### టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి


మాట్లాడుతున్న పవన్‌కుమార్‌గౌడ్

**గుంతకల్లు, ఫిబ్రవరి 3:** ఎన్నికల ముందు నిరుద్యోగులను మభ్య పెట్టడానికే జగన్ మెగా డీఎస్సీ నాటకం ఆడుతున్నాడని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండరును ప్రకటిస్తానంటూ ప్రగల్భాలు పలికి నాలుగున్నర ఏళ్ల మీనమేషాలు లెక్కించి ఇప్పుడు మెగా డీఎస్సీ అంటూ యువతను దగా చేస్తున్నాడన్నారు. రెండు నెలల్లో అధికారం లోంచి దిగిపోయే స్థితిలో ఉన్న జగన్ ఉద్యోగాలిచ్చేదేమీ ఉండదన్నారు. సమావేశంలో టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు అమ్లెట్ మస్తాన్ యాదవ్, వాల్మీకి సాధికార సమితి ప్రధాన కార్యదర్శి తలారి మస్తానప్ప, బీసీ సెల్ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు టీ కేశప్ప, సింగిల్ విండో సొసైటీ మాజీ అధ్యక్షుడు పాల మల్లికార్జున, కురుబ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కే చంద్రశేఖర్, నాయకులు హనుమంతు, శివప్ప, ముక్కన్నగారి రామాంజనేయులు, జగన్నాథ్, ఫజులు, మహదేవ్, బండి లక్ష్మిదేవి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే అభివృద్ధి: హిమబిందు


ఈశ్వరపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న పత్తి హిమబిందు

**గుత్తిరూరల్, ఫిబ్రవరి 3:** టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి చేందుతాయని ఆ పార్టీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు పేర్కొన్నారు. మండలంలోని ఈశ్వరపల్లి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ, సోమశేఖర్, నరసింహులు, కదిరెప్ప, జానికి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

### 'అప్పుల ఊబిలో రాష్ట్రం'

**పామిడి:** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రానుందని పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్ కృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డులో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పత్రా శ్రీనివాసులు, నాయకులు చీమల రాము, యుగంధర్, మాబు పాల్గొన్నారు.

## నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

### విద్యార్థులకు కేసీ హరి సూచన


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ కేసీ హరి తదితరులు

**గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 3:** పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి అన్నారు. కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు శనివారం అభినందన కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పతిభ ఉంటే ఉద్యోగాలు వస్తాయన్నారు. భవిష్యత్తులో కళాశాలలో మరిన్ని జాబ్‌మేళాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, కళాశాల ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, ఆధ్యాపకులు డాక్టర్ గోపి పాల్గొన్నారు.

## పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఈవో, అర్చకులు

**ఉరవకొండ, ఫిబ్రవరి 3:** మండల పరిధిలోని పెన్నహోబిలంలో శనివారం రథసప్తమి వేడుకల పోస్టర్ల విడుదల చేశారు. స్థానిక కల్యాణ మండప ఆవరణలో ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకానాథాచార్యులు పోస్టర్లను ఆవిష్కరించారు. రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 16న సూర్యప్రభ, గో, హనుమంత, గరుడ వాహనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు బాలాజీ, సిబ్బంది మారుతీ, దీపక్ పాల్గొన్నారు.

### వైభవంగా పల్లకి సేవ

పెన్నహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.

### 'ఇది దగాకోరు డీఎస్సీ'

**రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 3:** ఇది మెగా డీఎస్సీ కాదని దగాకోరు డీఎస్సీ అని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం దారుణమన్నారు. మెగా డీఎస్సీ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. సమావేశంలో యోగేంద్ర, సునీల్, దినకర్ తేజ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచకపాలన

### యువచైతన్య బస్సుయాత్రలో జేసీ ప్రభాకర్‌రెడ్డి


బస్సుయాత్రలో జేసీ ప్రభాకర్‌రెడ్డికి జనహారతి

**యాడికి, ఫిబ్రవరి 3:** రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తండా, పుప్పాల, వెంగన్నపల్లి, భోగాలకట్ట, టీ కొత్తపల్లి, తూట్రాళ్లపల్లి, రామరాజుపల్లి, కుర్మాజీపేట, రాయలచెరువు గ్రామాల్లో యువచైతన్య బస్సుయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా తూట్రాళ్లపల్లిలో పలువురు గ్రామస్తులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సైకో పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా అటకెక్కిందన్నారు. వైసీపీ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేలూరు రంగయ్య, చవ్వా గోపాల్‌రెడ్డి, పరిమి చరణ్, శ్యాంసుందర్, మాదాల అనిల్, కులశేఖర్‌నాయుడు, శోభన్‌బాబు, రజక శేఖర్, నాగరాజుగౌడ్, జాఫర్, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా రాయలచెరువులో బస్సుయాత్రకు వేలాదిగా తరలివచ్చిన జనంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి ఫుల్‌జోష్ నింపారు. సైకో పోవాలి... సైకిల్ రావాలి పాటకు స్టెప్పులు వేస్తూ యువతలో ఉత్సాహం నింపారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

### టీడీపీలో చేరిక

జేసీ ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్ర రాయలచెరువుకు వచ్చిన సమయంలో 25 కుటుంబాలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. కొత్తకొట్టాలు కాలనీలోని పాల మద్దిలేటి ఆధ్వర్యంలో వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి...


పార్టీలో చేరిన వారితో జేసీ అస్మిత్‌రెడ్డి

**యాడికి:** మండలంలో 250 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. అంకాలమ్మవీధి, కొండకింద వీధి, చౌడేశ్వరికాలనీల్లోని 250 మంది వైసీపీ కార్యకర్తలు శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో సామాన్య ప్రజల కష్టాలు తీర్చే వారే కరువయ్యారన్నారు. జేసీ అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో మల్లికార్జున, పూలతోట రవి, పాండు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, విశ్వనాథ్, తిరంపురం నీలకంఠ, బొట్టు శేఖర్, నారాయణస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

**తాడిపత్రి:** పట్టణంలోని శ్రీనివాసపురంలో శనివారం టీడీపీ ఇన్‌చార్జిజేసీ అస్మిత్ రెడ్డి పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### సొంత ఖర్చుతో కంచె ఏర్పాటు

పట్టణంలోని ఆసుపత్రిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణగా కంచెను సొంత ఖర్చులతో జేసీ అస్మిత్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నాలుగురోజులక్రితం పర్యటించిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్న భయాన్ని జేసీ అస్మిత్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన సొంత నిధులతో కంచె ఏర్పాటు చేయించారు.

## ఓటరు జాబితాలో తప్పులను సవరించాలి

### ఆర్డీఓకు విన్నవించిన ఉమామహేశ్వరనాయుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 3:** ఓటర్ల జాబితాలో తప్పులను సవరించాలని ఆర్డీఓ రాణిసుష్మితకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు విన్నవించారు. శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆమె ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఉమామహేశ్వరనాయుడు పలు తప్పిదాలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఓటరు జాబితాలో తప్పిదాలపై గతంలో ఫిర్యాదు చేసినా పునరావృతం అయ్యాయన్నారు. డెడ్ ఓటర్లను తొలగించలేదని, మున్సిపాలిటీ పరిధిలో డబుల్ ఎంట్రీ పేర్లు చాలా వార్డుల్లో వచ్చాయన్నారు. ఒక వార్డుల్లో ఉన్నవారు మరొక వార్డుల్లో కూడా కనిపిస్తున్నారన్నారు. వీటిపై ఆధారాలు ఇచ్చామని, వాటిని పరిశీలించి తొలగించాలన్నారు. ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండాలని కోరారు. ఈసారి కూడా అలాగే వస్తే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఓటరు జాబితాలోని తప్పులను సవరిస్తామని ఆర్డీఓ వివిధ రాజకీయ పార్టీల నాయకులకు స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఐ తాలూకా నాయకుడు గోపాల్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశులు పాల్గొన్నారు.

### నిరుద్యోగులను నట్టేట ముంచిన సైకో జగన్

**కళ్యాణదుర్గం:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతను నట్టేట ముంచిన ఘనత సైకో జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు ఎద్దేవా చేశారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి యేటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామన్న జగన్ మాట నిలుపుకోలేకపోయారన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డికి ఆ నిరుద్యోగులే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో వున్నాయన్నారు. ఆరు వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడం హాస్యాస్పదమన్నారు. ఆరు వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తే లక్షలాది యువత ఉద్యోగాల కోసం ఎక్కడికెళ్లాలని ప్రశ్నించారు. ఎన్నికల ముందు యువతను, రాష్ట్ర ప్రజలను దగా చేయడానికే ఈ ప్రకటన చేశారని అన్నారు. రాష్ట్రాన్ని గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అడ్డాగా మార్చేశారన్నారు. ఇటువంటి దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర్లో వున్నాయని హెచ్చరించారు.

## అంజన్నకు విశేష పూజలు



నేమకల్లు, అమలాపురంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

**బొమ్మనహాళ్, ఫిబ్రవరి 3:** మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి వారికి శనివారం విశేషపూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు పూజలు జరిపించారు. వేకువ జామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మాల్య విసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర శతనామావళి నిర్వహించి వెండి కవచం అలంకరణ, పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**రాయదుర్గంరూరల్:** మండలంలోని మల్లాపురం సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామీజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వడ్రవన్నూరు సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## గుప్తనిధుల వేటగాళ్ల అరెస్ట్


అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐలు

**యాడికి, ఫిబ్రవరి 3:** మండలంలోని గుడిపాడు గ్రామ సమీపంలో తొమ్మిదిమంది గుప్తనిధుల వేటగాళ్లను శనివారం అరెస్ట్‌చేసినట్లు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య తెలిపారు. శనివారం యాడికి పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గుడిపాడు గ్రామ సమీపంలోఉన్న యర్రమల కంబగిరిస్వామి ఆలయం సమీపంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలమేరకు యాడికి సీఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి గుప్త నిధుల తవ్వకాలు చేపడుతున్న తొమ్మిదిమందిని పట్టుకున్నట్లు వెల్లడించారు. కొట్టం హరి, కొట్టం పవన్‌కుమార్, చింతకాయల నాగేష్, చింతకాయల శ్రీరాములు, చింతకాయల శివగంగరాజు, చింతకాయల రామచంద్ర, చింతకాయల పెద్దయ్య, కొట్టం సురేంద్ర, పడమల ఓబులేసులను అరెస్ట్‌చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరంతా ఒకరికొకరు సమీప బంధువులని వివరించారు. వీరి నుంచి 8 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్రవాహనాలు, గడ్డపారలు, పికాసి, పారలను సీజ్‌చేసినట్లు తెలిపారు. గుప్తనిధుల వేటగాళ్లను పట్టుకున్న సీఐని, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## అపహరణకు గురైన వాహనం పట్టివేత

**పెద్దవడుగూరు, ఫిబ్రవరి 3:** నిలిపిఉంచిన సిమెంట్ లోడ్ వాహనాన్ని అపహరించి తీసుకొని వెళుతున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకున్న సంఘటన చోటుచేసుకుంది. అనంతపురం నగరంలోని కల్యాణదుర్గం బైపాస్‌రోడ్డులో ఏపీ 37టి3 1699 నెంబర్ ఐచర్‌వాహనాన్ని డ్రైవర్ రాము నిలిపి ఉంచి వెళ్లాడు. ఇదే అదును చూసుకొని గుత్తి మండలం ఆర్ఎస్‌కు చెందిన భాస్కర్ ఆ వాహనాన్ని అపహరించాడు. విషయం తెలుసుకున్న డ్రైవర్ 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించడంతో పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు ఆ వాహనాన్ని పట్టుకున్నారు. భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం 4వ పట్టణ పోలీసులకు అప్పగించారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 3:** మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన వివాహిత రాధ (27) అనంతపురంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. హరికృష్ణ, రాధ దంపతులు. కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవారు. కొన్నిరోజుల నుంచి రాధ కడుపునొప్పితో బాధపడుతుండేది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో శుక్రవారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### ముగ్గురిపై కేసు

**యాడికి, ఫిబ్రవరి 3:** మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో స్మశాన వాటిక రస్తా వివాదంపై కంబగిరి రాముడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి, రామాంజులరెడ్డి, రమణారెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కులంపేరుతో దూషించారన్న ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశామని పేర్కొన్నారు.

### టీడీపీ నాయకుల బైండోవర్

**పామిడి, ఫిబ్రవరి 3:** పట్టణంలో గత ఏడాది అక్టోబరు 23న టీడీపీ పిలుపు మేరకు తెలుగు తమ్ముళ్లు జగనాసుర దహనం కార్యక్రమంలో భాగంగా దిష్టిబొమ్మను దగ్ధం చేసినందుకు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆ కేసులోని నిందితులను పోలీసులు తహసీల్దార్ ఆర్ వీ సునీతాబాయి ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై బైండోవర్ అయిన 11 మందిని విడుదల చేశారు.

## బడ్జెట్ ప్రతుల దహనం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 3:** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను ఏపీ రైతు సంఘం నాయకులు దహనం చేశారు. పట్టణంలోని గాంధీసర్కిల్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసిన అనంతరం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు ఏమాత్రం మేలు చేకూర్చలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టే విధంగా ఉందన్నారు. కనీస మద్దతు ధర కల్పిస్తామన్న ప్రధాని హామీని తుంగలో తొక్కారన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను తలపెట్టామని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు జయశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి, పుల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

### 'చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా'

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 3:** చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఉంచుతున్నట్లు ఆర్డీఓ రాణి సుష్మిత, డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కంబదూరు కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాహన నెంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా అనుమానాస్పద వాహనాలు వస్తే తనిఖీ చేపట్టి పూర్తిస్థాయి వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**బొమ్మనహాళ్, ఫిబ్రవరి 3:** అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 288(90ఎంఎల్) ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. కణేకల్లు మండలంలోని 43 ఉడేగోళం గ్రామానికి చెందిన పెద్ద ఆంజినేయ గారి వన్నూరుస్వామి, మణికంఠ అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా ఉంతకల్లు క్రాస్ వద్ద అరెస్టు చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

**డీ.హీరేహాళ్:** మండలంలోని సోమలాపురం గ్రామ సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న నాగలాపురం గ్రామానికి చెందిన శంకర్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తున్న శంకర్‌ను అదుపులోకి తీసుకుని 96 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

## వాహనదారులు హెల్మెట్ ధరించాలి: ఆర్టీఓ

**ఉరవకొండ, ఫిబ్రవరి 3:** వాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఆర్టీఓ సురేష్‌నాయుడు సూచించారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పని సరిగా పాటించి వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఇస్తే తల్లిదండ్రులపైనే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజాబాబు, సీఐ తిమ్మయ్య, ప్రిన్సిపాల్ మమత పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల తనిఖీ

**ఉరవకొండ, ఫిబ్రవరి 3:** వజ్రకరూరు మండలంలోని పీసీ కొత్తకోట, పీసీ ప్యాపిలీ, రాగులపాడు, పందికుంట, తట్రగల్లు, వజ్రకరూరు, గూళ్యపాళ్యం, కొనకొండ్ల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యలపై తహసీల్దార్ మహ్మద్‌రఫీని ఆదేశించారు.

**రాయదుర్గంరూరల్:** ఎన్నిల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందని రాయదుర్గం నియోజకవర్గం ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కరుణాకుమారి సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, ఏఎస్ఐ భాస్కర్, ఈడీటీ సుజాత, డీటీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

**కుందుర్పి:** పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులకు తావు ఉండకూడదని ఆర్డీఓ రాణి సుష్మిత ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బీఎల్‌ఓలు, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో సవరణలు పకడ్బందీగా చేపట్టాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

**పామిడి:** మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. అక్కడక్కడ లోపాలను గుర్తించి ఆయా బీఎల్‌ఓలు, జోనల్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఏఓ లీనావసుంధర, ఎంఈఓలు జయానాయక్, సత్యనారాయణ, ఈఓఆర్డీ శశికళ, మండల ఇంజనీర్ హేమ్లానాయక్, ఆర్ఐ క్రాంతికుమార్, ఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**గుత్తిరూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దారు భారతి పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, వీఆర్ఓ రంగయ్య పాల్గొన్నారు.

### మునిసిపల్ కార్మికులకు శిక్షణ తరగతులు

**గుత్తి, ఫిబ్రవరి 3:** మునిసిపల్ కార్మికులకు శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నిర్మల, మునిసిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, రామాంజినేయులు, ఇంజనీరింగ్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

### బదిలీలు నిలిపివేయాలని నిరసన

**ఉరవకొండ, ఫిబ్రవరి 3:** అక్రమ బదిలీలు నిలిపివేయాలని వజ్రకరూరు మండలంలోని ప్యాపిలి సమీపంలో ఉన్న గాలి మరల కార్యాలయం వద్ద శనివారం ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుజలాన్ కంపెనీలో పని చేస్తున్న 35 మందిని గుజరాత్, భారత సరిహద్దుకు బదిలీ చేశారన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమను బదిలీ చేస్తే ఎలా అని ప్రశ్నించారు. బదిలీపై యాజమాన్యం పునరాలోచించాలన్నారు.

### నల్లబ్యాడ్జీలు ధరించి..

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 3:** విశాఖ జిల్లా కొమ్మాది మండలంలో తహసీల్దారుగా పనిచేస్తున్న రమణయ్య దారుణహత్యకు గురికావడంతో నిరసనగా రెవెన్యూ సిబ్బంది నిరసన చేపట్టారు. శనివారం కంబదూరులోని తహసీల్దారు కార్యాలయం నల్లబ్యాడ్జీలు ధరించి అధికారులకు భద్రత కల్పించాలి అంటూ నినాదాలు చేశారు. దుండగులపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో డిప్యూటీ తహసీల్దారు నారాయణస్వామి, సీఎస్‌డీటీ విజయలక్ష్మీ, ఆర్ఐ కిరణ్, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### 'అభివృద్ధి రఘువీరాతోనే సాధ్యం'

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 3:** నియోజకవర్గ అభివృద్ధి రఘువీరారెడితోనే సాధ్యమని పీసీసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పొంక, పాపంపల్లి, గరుడాపురం, యర్రంపల్లి, నారాయణపురం, గాజులపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీరు, ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో పరిశ్రమలను తీసుకురావాలన్నా రఘువీరారెడ్డితోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు తిమ్మప్ప, డీసీసీ ప్రధాన కార్యదర్శి కరీంసాబ్, డీసీసీ కార్యదర్శులు బలరాం, భాస్కర్, రాజు, మల్లయ్య, ఈరన్న, ప్రసాద్, తిమ్మరాజు, శివన్న, రామాంజినేయులు పాల్గొన్నారు.

### డీఆర్ఎంతో ఐఓసీ మేనేజరు భేటీ

**గుంతకల్లు, ఫిబ్రవరి 3:** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చీఫ్ డిపో మేనేజరు నవీన్ కుమార్ శనివారం ఉదయం గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్‌తో భేటీ అయ్యారు. ఇంధన రవాణాపై చర్చించారు. డీఆర్ఎం మాట్లాడుతూ ఐఓసీకి తన సహాయ సహకారాలను సంపూర్ణంగా అందజేస్తానని పేర్కొన్నారు. అనంతరం బదిలీపై వచ్చిన డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డిని కలశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ లైజనింగ్ ఆఫీసరు జీఏ నజీర్ పాల్గొన్నారు.

### శీర్పి పంచాయతీకి ఇద్దరు వీఆర్వోలు

**బెళుగుప్ప, ఫిబ్రవరి 3:** బదిలీపై వెళ్లిన తహసీల్దారు నిర్వాకంతో మండలంలోని శీర్పి పంచాయతీకి వీఆర్వో ఎవరో తెలియని పరిస్థితి నెలకొంది. బెళుగుప్ప వీఆర్వో యర్రిస్వామిని శీర్పి పంచాయతీకి డిప్యూటేషన్‌పై పంపారు. అక్కడ వున్న వీఆర్వో రాజశేఖర్‌ను బెళుగుప్ప సచివాలయం-2కు పంపుతున్నట్లు మూడు నెలల క్రితం ఆర్డర్ వేశారు. ప్రస్తుతం రాజశేఖర్‌కు మాత్రమే బదిలీ ఆర్డరు ఇచ్చి తహసీల్దార్ వెళ్లిపోయారు. యర్రిస్వామికి సమాచారం కూడా ఇవ్వకపోవడంతో సమస్య నెలకొంది. ఒకే పంచాయతీకు ఇద్దరు వీఆర్వోలు వుండటంతో గందరగోళం ఏర్పడింది. హాజరుపట్టికలో ఎవరు వీఆర్వోగా సంతకం చేయాలో ఇబ్బంది పడుతున్నారు.

### బాధ్యతల స్వీకరణ

**యాడికి, ఫిబ్రవరి 3:** మండల తహసీల్దార్‌గా మోహనవల్లి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధుల్లో నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు.

### నూతన ఎంపీడీఓగా రఘునాథ్...

**డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 3:** నూతన ఎంపీడీఓగా రఘునాథ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బదిలీలో భాగంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.